క్లుప్తంగా

మండల కో-ఆర్డినేటర్‌కు సీఎం అభినందన



మద్దూరు: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ సామాజిక మాధ్యమాల్లో చురుకుగా వ్యవహరించి పార్టీ గెలుపునకు కృషి చేసిన మండల సోషల్ మీడియా మండల కో -ఆర్డినేటర్ హరీశ్వర్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని దాస్పల్లా హోటల్‌లో అభినందించారు. ఈ మేరకు.. హరీశ్వర్‌రెడ్డి రక్తంతో తయారు చేయించిన చిత్రపటాన్ని సీఎంకు బహూకరించారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

మరికల్: ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎన్నికల కోడ్ సందర్భంగా వాయిదా వేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ పావని తెలిపారు. గురువారం మండల సమావేశానికి వచ్చిన ఎంపీటీసీలతో సంతకాలు చేయించుకొని వాయిదా వేశారు. అనంతరం కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే తాగునీటి సమస్య రాకుండా చూడాలని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మండల సమావేశం నిర్వహించేందుకు మరో తేదీని ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నాటక ప్రదర్శన ప్రారంభం



కృష్ణా: ప్రజలను పలు అంశాలపై చైతన్యం చేసేందుకు గాను సామాజిక నాటకాలు అవసరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం రాత్రి ఆలంపల్లిలో మారెమ్మ దేవత బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామ యువకులు ఏర్పాటుచేసిన నాటిక ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు.. ప్రధానంగా కనుమరుగవుతున్న సామాజిక నాటకాలను ఈ ప్రాంత కళాకారులు ఉత్సాహంతో ప్రదర్శించడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శివరాజ్‌పాటిల్, గ్రామ మాజీ సర్పంచ్ రామకృష్ణాదణి, కాంగ్రెస్ నాయకులు సిద్దప్పగౌడ, నాగేందర్, నాగేశ్వర్‌రావు, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ ధ్వంసం



మక్తల్: పట్టణంలోని బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో గురువారం ప్రహరీని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయమై పాఠశాల జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు అనంతరం ఎంఈఓ వెంకటయ్యకు సమాచారం తెలియజేయడంతో వెంటనే ఆయన అక్కడికి చేరుకుని పరిశీలించారు. పాఠశాల ప్రహరీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మరికల్: మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త డోంగుల ఆంజనేయులు అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సాయం చేశారు. కాంగ్రెస్ పార్టీ తరఫున తమ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని ఆయన వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హరీష్, నరహరి, జయసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, ఆంజనేయులు, రఘు, రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ

మక్తల్: పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం బాలింతలకు విద్యార్థినులు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వేసవి సెలవులు ఉండటంతో అందరూ ఒకేచోట కలుసుకుని వారికి తోచిన విధంగా బాలింతలకు సాయం చేయాలని ఆలోచనతో ఆస్పత్రిలో విద్యార్థినులు శిల్ప, శృతిక, ఐశ్వర్య, శ్రీజ కలిసి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పార్వతి, శిల్ప, శృతిక, ఐశ్వర్య, శ్రీజ పాల్గొన్నారు.



పక్కా ప్రణాళిక

- విత్తనాల పంపిణీకి రంగం సిద్ధం
- మండల వ్యాప్తంగా 38వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ముదుమాల్ గ్రామ శివారులో పత్తి విత్తేదేందుకు రైతులు సిద్ధం చేసిన పొలాలు

కృష్ణా: వర్షకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని మండలవ్యాప్తంగా రైతులు పంటల సాగుకోసం పక్కా ప్రణాళికలు రూపొందించుకుని సిద్ధమయ్యారు. గత పక్షం రోజుల క్రితం కురిసిన వర్షానికి పొలాలు అన్ని రకాలుగా దుక్కులు దున్నుకొని, జూన్ మొదటి వారంలో విత్తనాలు విత్తేందుకు పొలాలను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే వ్యవసాయ శాస్త్రజ్ఞులు రుతుపవనాలు కూడా సకాలంలోనే ప్రవేశిస్తాయని చెప్పడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది. విత్తనాలను జూన్ మొదటి వారంలో వచ్చే మృగశిర కార్తిలో విత్తుకుంటే పంటలు బాగా పండుతాయని ఈ ప్రాంత రైతుల అభిప్రాయం. గత సంవత్సరం వర్షాలు ఆలస్యంగా రావడంతో పొలాలు సిద్ధం చేసుకోలేకపోయారు. తద్వారా విత్తనాలను సరైన సమయంలో వేయకపోవడంతో పంటలు దెబ్బతినడంతోపాటు రైతులకు అనుకున్నంతా పంటలు పండక నష్టాలు వచ్చాయి. అందుకే వర్షాలు ముందుగా కురుస్తే సకాలంలో విత్తనాలు విత్తుకునేందుకు అవకాశం ఉంటుంది.

వ్యవసాయశాఖ సన్నద్ధం..

వర్షకాలంలో అన్నిరకాల పంటలు సాగుచేసేందుకు వీలుగా రైతులకు విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకున్నారు. వరి, పత్తి పంటలకు ప్రాధాన్యత ఇస్తూ సాగుకోసం ప్రణాళికలు రూపొందించారు. రైతులకు అవసరమయ్యే సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు విత్తనాలు, ఎరువులు పంపిణీ చేసేందుకు వీలుగా వ్యవసాయశాఖ అధికారులు కసరత్తులు చేస్తున్నారు. గత ఏడాది కంటే ఈసారి వరి, పత్తి పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వరి సాధారణ విస్తీర్ణం 12వేల ఎకరాలు కాగా, ఈ వర్షకాలంలో 12 వేల ఐదువందల ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉంది. అదేవిధంగా పత్తి గతంలో 21వేలు ఉండగా ఇప్పుడు అది 26వేల వరకు పెరగనుందని చెబుతున్నారు. అదేవిధంగా గతంలో కందులు వంద ఎకరాల్లో సాగు ఉండగా ఇప్పుడు కూడా అదే స్థాయిలో సాగయ్యేందుకు అవకాశం ఉందని అంటున్నారు. మండలంలో ఈ సంవత్సరం అనుకూలంగా వర్షాలు కురవడంతో పంటలు 10నుంచి 20శాతం వరకు సాగు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. వర్షకాలంలో పంటల సాగుకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించేందుకు అధికారులు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నారు.

పొలాలు సిద్ధం చేసుకున్నాం



గత పక్షం రోజుల క్రితం కురిసిన వర్షాలకు పొలాల్లో దుక్కులు చేసుకొని, వచ్చేనెల 7న మృగశిర కార్తిలో విత్తనాలు విత్తేందుకు అన్ని రకాలుగా సిద్ధమయ్యాం. జూన్ మొదటివారంలో ఒక్క వర్షం వస్తే చాలు ఇక మేము విత్తనాలను పెట్టేస్తాం.

\- కుంబరి చంద్రప్ప, మురహర్‌దొడి

రైతులు మోసపోవద్దు..



ఉమ్మడి మండలాల్లో మొత్తం 12క్లస్టర్‌లలో వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యటిస్తూ రైతులకు పంటల వివరాలు, ఎరువులు వాడే విధానం, భూసార పరీక్షలు, రైతు భూమి స్వభావం తదితర అంశాలు వివరించాం అదేవిధంగా రైతులు విత్తనాల విషయంలో ప్రైవేట్ డీలర్ల నుంచి కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిర్దేశించిన దుకాణాల్లో కొనుగోలు చేయాలి. ఈ విషయంపై రైతులకు తగిన సూచనలు, సలహాలను అందిస్తున్నాం.

\- మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్, కృష్ణా

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



పెదిరిపాడ్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ విజయకుమార్

మద్దూరు: బాలల హక్కులు, వారికి ప్రభుత్వాలు కల్పిస్తున్న చట్టాలపై ఉపాధి కూలీలకు చైల్డ్‌హెల్ప్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ నర్సింహ గురువారం పెదిరిపాడ్‌లో అవగాహన కల్పించారు. ఈ మేరకు.. మాట్లాడుతూ.. అనాథలైన బాలలకు, పిల్లలను పోషించలేని పరిస్థితిలో ఉన్న వారు పిల్లలను తమకు అప్పగిస్తే వారికి అన్ని రకాలుగా అర్హత ఉన్న పిల్లలులేని తల్లిదండ్రులకు చట్ట ప్రకారం దత్తత ఇస్తామని తెలిపారు. అలాగే బిడ్డలు లేని వారికి దత్తత తీసుకోవడం సహాయం చేస్తామన్నారు. అలాగే బాలహక్కులు, వారికి కల్పిస్తున్న చట్టాల గురించి వివరించారు. బాలలకు ఏ అవసరం వచ్చిన 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సూపర్‌వైజర్ లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని కర్నిలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద గురువారం సంస్థ కో-ఆర్డినేటర్ విజయకుమార్ బాలలరక్షణ, చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. బాలల హక్కుల పరిరక్షణ గురించి వివరించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. గ్రామాల్లో ఆడపిల్లలను మధ్యలోనే చదువు మాన్పించొద్దని, బాల్యవివాహాలు చేయొద్దని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తే 1098కు కాల్‌చేయాలని కోరారు. విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ బాల్‌రాజ్,రఘు, పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్

ధన్వాడ: ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కుర్వగేరిలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అంటరానితనం, మూఢనమ్మకాలు, బాల్యవివాహాలు తదితర అంశాలపై అవగాహన నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. ప్రజలు మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయి, గుట్కా మద్యపానం వాటికి దూరంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 193కుగాని డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కళ్యాని, రుక్యానాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య



ప్రచారంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు

కోస్గి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే నిష్ణాతులైన అధ్యాపకులు ఉంటారని, ప్రైవేట్ జూనియర్ కళాశాలల కంటే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన ఉచిత విద్యా అందుతుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సూచించారు. ఈ మేరకు గురువారం పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. 204-05 సంవత్సరంలో పదోతరగతి పాసైన తమ పిల్లలను ఇంటర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉన్న సౌకర్యాలను వివరిస్తూ అడ్మిషన్లు చేయించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం జ్ఞానేశ్వర్, మల్లికార్జుతోపాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోస్గి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా నేడు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పర్వతాలు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలతోపాటు కోస్గి పట్టణం, మున్సిపల్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ, వాణిజ్య, గృహ వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని సూచించారు.

మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం



తహసీల్దార్ సువర్ణరాజుకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: వరికి అదనంగా రూ.500లు అందిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం బీఆర్‌ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మట్లాడుతూ.. వరి పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని సీఎం రేవంత్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. అనంతరం రైతుల సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ సువర్ణరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, రాజేష్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు చిన్నహన్మంతు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, రాజుల ఆశిరెడ్డి, కౌన్సిలర్లు మొగులప్ప, అన్వర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

60శాతం కూలీలు పనికి వెళ్లేలా చూడాలి

దామరగిద్ద: ప్రతి గ్రామంలో 60శాతం కూలీలకు పని కల్పించాలని ఎంపీడీఓ శ్రీధర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏఈపీ జయమ్మ సమక్షంలో ఈజీఎస్ పథకం ద్వారా ఉపాధి కల్పనపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 12212 మంది కూలీలు జాబ్‌కార్డులు కల్గి ఉన్నారన్నారు. అరవై శాతం కూలీలు పనికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనికి వెళ్లిన కూలీలకు గరిష్ఠంగా రూ. 300 కూలీ పొందేలా కొలతలను నిర్ధేశించి పనికల్పించాలని సకాలంలో కూలీ డబ్బులు అందేలా ఎప్పటి కప్పుడు మస్టర్‌లను జనరేట్ చేసి పేమెంట్‌లు అయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈజీఎస్ టీఏలు, ఎఫ్‌ఏలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సిగ్నల్ అర్థంకాక.. వాహనదారుల ఇక్కట్లు



సిగ్నల్‌పై ఒకేసారి వెలిగిన రెడ్, గ్రీన్ లైట్లు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల నియామకంతోపాటు సిగ్నలింగ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ఆరు నెలలుగా స్థానిక శ్రీ సత్య నారాయణ సర్కిల్‌లో సిగ్నల్స్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ కొనసాగుతుంది. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళలలో రద్దీగా ఉండే సమయంలో వాటిని ఆన్‌లో ఉంచి మధ్యాహ్నం, రాత్రి వేళలో ఆఫ్ చేస్తున్నారు. వాస్తవానికి చౌరస్తాకు చేరుకున్న వాహనదారులకు రెడ్‌కాని గ్రీన్ సిగ్నల్ కాని పడితే ఆగడం, వెళ్లడం చేస్తారు. కాని గురువారం సాయంత్రం దాదాపు గంటకుపైగా పాత బస్టాండ్ నుంచి వచ్చే వాహనాలకు రెడ్, గ్రీన్‌లైట్లు రెండూ ఒకేసారి సిగ్నల్‌లో చూయిస్తుండటంతో అటుగా వచ్చిన వాహనదారులు అర్థంకాక ఇబ్బంది పడ్డారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసు సైతం చాలా సమయం వరకు గుర్తించకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. అయితే వర్షం కారణంగా సాంకేతిక సమస్య ఏర్పడి అలా జరిగిందని, సరిచేసి వాహనదారుల ఇబ్బందులు తొలగిస్తామని అధికారులు తెలిపారు.

రాష్ట్ర ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్రమైన హజ్‌యాత్రలో యాత్రికులు రాష్ట్ర ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలని... రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. హజ్‌యాత్రకు వెళ్తున్న వారిని హైదరాబాద్‌లోని హజ్‌హౌజ్ ప్రాంగణంలో గురువారం కలిశారు. యాత్రికులతో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్తుతున్న ప్రత్యేక బస్సును కొత్వాల్ తదితరులు సాగనంపారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు హజ్‌యాత్రికులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హజ్‌యాత్ర చేయాలని ప్రతి ముస్లిం కోరుకుంటాడని, ఆ అదృష్టం కొంతమందికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం తరఫున అనేక సేవలు అందించినట్లు వివరించారు.

వారాంతపు సంతకు వర్షం ఎఫెక్ట్



వర్షపు జల్లులలో కురగాయలు కొంటున్న ప్రజలు

అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం కురిసిన వర్షానికి వారాంతపు సంతలో సరుకులను విక్రయించేందుకు వచ్చిన వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కురగాయలు, ఆకు కూరలు, పండ్లు, అల్లం, వెల్లుల్లి వ్యాపారులు తమ సరుకులను అమ్ముకోనేందుకు గురువారం అమరచింతలో జరిగే వారాంతపు సంతకు వచ్చారు. మధ్యాహ్నం నాలుగున్నర గంటల నుంచి వర్షం కురుస్తుండటంతో కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, ఇతర వస్తువులు వర్షపు నీటిలో తడిసిపోవడంతో ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షపు జల్లులు కురుస్తుండడంతో ప్రజలు కూరగాయలు కొనేందుకు గొడుగుల సహాయంతో సంతకు వచ్చారు.

నిరుపయోగంగా నీటి ట్యాంక్



దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్‌లోని రామాయలం వద్ద ఉన్న మినీవాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. దీంతో ట్యాంక్ పరిసప్రాంతంలో ఉన్న స్థానికులు అర కిలోమీటర్ దూరంలో ఉన్న వేరే ట్యాంకు నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని స్థానికులు వాపోతున్నారు. వాల్‌ను మరమ్మతు చేయించి ట్యాంకుకు నీటిని సరఫరా చేసి నీటిసౌకర్యం కల్పించాలని స్థానిక పంచాయతీ కార్యదర్శిని కోరిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి వాల్‌ను మరమ్మతు చేయించి నీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా ఇప్పటికీ నాలుగు సార్లు మరమ్మతుల చేయించామని, స్థానికులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తరుచు పాడుచేస్తున్నారని అన్నారు. శుక్రవారం మరమ్మతు చేయిస్తామని తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి



సమీక్షలో పాల్గొన్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మంజూరైన వివిధ పనులు గడువు (జూన్ 10) లోగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 48 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని గుర్తించామన్నారు. కొన్ని చోట్ల మరుగుదొడ్ల, మరి కొన్ని చోట్ల తరగతి గదుల మరమ్మతు, ఇంకొన్ని చోట్ల తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. వీటిలో ఇప్పటివరకు 22 పనులు ప్రారంభం కాగా, మిగతావి వెంటనే చేపట్టాలన్నారు. పంతఈ యు.బస్వరాజ్, డిప్యూటీ ఈఈలు బెంజిమన్, యూనుస్, ఏఈలు సాయిరాం పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ



కోస్గిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు

కోస్గి: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గుండుమాల్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మండల పరిధిలోని ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బందితో కలిసి పుర వీధులగుండా, కోస్గి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి కిష్టమ్మ డెంగ్యూ వ్యాధి వ్యాపించే విధానం, నిర్మూలనకు తీసుకోవాల్సిన కనిస జాగ్రత్తలను వివరించారు. అనంతరం కోస్గి ప్రభుత్వాస్పత్రిలో డెంగ్యూ నివారణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాంచందర్‌జీ, మణిమాల, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్‌తోపాటు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మక్తల్: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏడీస్ దోమకాటు వల్ల డెంగ్యూ వస్తుందని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పాతటైర్లు, కొబ్బరి చిప్పలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తచెదారాలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డాక్టర్లు తిరుపతి, వినోద్, మల్లికార్జున్, సమీనా, విరోజ, నజీరా, శ్రీలత, వైద్యసిబ్బంది శ్రీధర్, నర్సింగమ్మ, కేశవులు, యాదగిరి, సాయిబాబా పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆశ, ఏఎన్‌ఎంలు డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక చౌరస్తాలో వ్యాధి నిర్మూలనకు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశ కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడారు.. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధిని నివారించవచ్చున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ నిల్వ నీటిని పారబోస్తూ నూతన నీటిని పట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరిటి కుమార్, హర్షిత, శ్రావణి, సూపర్‌వైజర్ బస్వరాజ్, సత్యనారాయణ, సువర్ణ పాల్గొన్నారు.

ఊట్కూరు: డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేద్దామని డా. భవాని అన్నారు. గురువారం మండలంలోని పులిమామిడి ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. గ్రామ పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించి ప్రజలకు డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలతో డెంగ్యూ వ్యాధి సంక్రమిస్తుందని చెప్పారు. ఇంటి పరిసరాలలోని మురుగు కాల్వలు, ఇంకుడు గుంతలు వంటి వాటిలో నీటిని నిల్వ ఉంచొద్దని దీంతో దోమలు అధికమై డెంగ్యూవ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గోవిందమ్మ, దేవికారాణి, మంజుల, ఆశాబీ, శంశీర్‌బేగం, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం మండలంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. డాక్టర్ నాగజ్యోతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డెంగ్యూ నివారణకు సహకరించాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నీరునిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్లాస్టిక్ డబ్బాల్లో, కుండల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేష్‌గౌడ్, ఏఎన్‌ఎం వేదవతి, వరలక్ష్మీ, గిరిజా, సుధారాణి, ఆశావర్కర్లు సరితా, రేణుకా, కృష్ణవేణి పాల్గొన్నారు.

నర్వ: డెంగ్యూ వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకుంటూ అరికడుదామని పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యులు వెంకటరమణ అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు.. డెంగ్యూ వ్యాధి వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ప్రభాకర్‌జెట్టి, సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ, ఫార్మసిస్ట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



మరికల్ ర్యాలీలో పాల్గొన్న ఆశ కార్యకర్తలు



నర్వలో..



ఊట్కూరులో..



మాగనూర్‌లో..



మక్తల్‌లో..